క్లుప్తంగా

ఆలయంలో మంత్రి పూజలు



పూజలు నిర్వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థుల సృజనాత్మక శక్తిని వెలికి తీయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయాలని ఎంఈఓ జోగు ప్రభుదాసు అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ) ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి సెల్ఫ్ విజార్డ్ డ్రామా పోటీలు నిర్వహించారు. సెల్ఫ్ విజార్డ్ ప్రశ్నాపత్రాలను టీచర్లతో కలిసి ఆవిష్కరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకట రాజలింగం, ఈఎల్‌టీఏ కన్వీనర్ నందగిరి శ్రీనివాస్, టీచర్లు రాజిరెడ్డి, ఎల్లేష్, సుమంత, నిర్మల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నివారణ చర్యలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుష్ఠువ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటామని డాక్టర్ రాజశేఖర్ అన్నారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా జగదేవ్‌పూర్, తిగుల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ తీశారు. మానవహారం నిర్మించిన అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భాను ప్రకాష్‌రావు, లక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటకమాన్: కుష్ఠువ్యాధిని దేశం నుంచి తరిమివేద్దామని ఎస్‌ఎల్‌ఈపీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం సిద్దిపేట ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జాతీయ లెప్రసీ నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠువ్యాధిపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షీబా, అధ్యాపకులు, డీపీఎంఓలు కృపలాదేవి, లక్ష్మణాచారి, హెచ్‌ఈఓ ప్రేమ్‌చందర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు

హుస్నాబాద్: గుడుంబా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ హెచ్చరించారు. గుడుంబా తయారీకి బెల్లం సరఫరా చేసిన హుస్నాబాద్‌కు చెందిన వ్యాపారి పవన్ కుమార్‌పై జనగామ పరిధిలో కేసు నమోదైందని, అతడిని మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ అహ్మద్ ఖాన్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. బెల్లం విక్రయదారులకు నోటీసులు ఇచ్చామని వారిని కూడా బైండోవర్ చేశామని తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి బెల్లం సరఫరా చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వాటర్ ప్లాంట్ బహూకరణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జ్యోతిష్మతి విద్యా సంస్థల అధినేత వాటర్ ప్లాంట్(ఆర్‌ఓ)ను మంగళవారం బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింగరావు మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు అందించాలని కోరగా సాగర్‌రావు స్పందించి ఆర్‌ఓను బహూకరించారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్ చారి, ఉపసర్పంచ్ మమత, ఎంపీటీసీ లక్ష్మి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

మర్కూక్(గజ్వేల్): గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు దొంగిలించి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదని మర్కూక్ గ్రామస్తులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారు సాక్షితో మాట్లాడారు. మర్కూక్ నుంచి చేబర్తి గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్‌లోని కాపర్ వైరును ఏడాది క్రితం గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని, ఈ విషయంపై విద్యుత్ ఏఈ సుధీర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. కాగా పంటలకు బోర్ల ద్వారా నీటి తడులు అందిస్తున్నామని, ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో బోర్లు పనిచేయడంలేదని, పంటల సాగు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

'బీజేపీని బలోపేతం చేయాలి'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ గావ్ చలో రాష్ట్ర కోఆర్డినేటర్ రంజిత్ మోహన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి అధ్యక్షతన గావ్ చలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

డిజిటల్ కంటెంట్ పుస్తకాల పంపిణీ

సిద్దిపేటరూరల్: ఎమ్మెల్యే హరీశ్‌రావు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న డిజిటల్ కంటెంట్ పుస్తకాలను మంగళవారం మండల పరిధిలోని తోర్నాల, రావురూకుల, బుస్సాపూర్ గ్రామాలతో పాటుగా నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పర్శరాములు, సదాశివారెడ్డి ఎంపీటీసీలు, నాయకులు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, నూతన ఉన్నత పాఠశాలల్లో బీఆర్‌ఎస్ నాయకులు పదో తరగతి విద్యార్థులకు మంగళవారం డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్స్ రెడ్డి విజేందర్ రెడ్డి, ఎల్లం యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు రజినీకాంత్ రెడ్డి, విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు మహిపాల్ గౌడ్ కో ఆర్డినేటర్ రెబల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్ : రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్, కేజీబీవీ, చిన్నకోడూరు ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే హరీష్‌రావు సౌజన్యంతో పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, ఎంఈఓ దేశిరెడ్డి, సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

పుస్తక పఠనంతో మేధోసంపత్తి

గజ్వేల్‌రూరల్: పుస్తక పఠనంతో మేధో సంపత్తి పెరుగుతుందని బాలచెలిమి కన్వీనర్ గరిపల్లి అశోక్ పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోగల జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలచెలిమి, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ మనికొండ వేదకుమార్ సహకారంతో బాలచెలిమి గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో లభించే పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానాన్ని మరింత పెంచుకోవచ్చన్నారు.

రాజకీయ అనుభవానికి సర్పంచ్ పదవి కీలకం

డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): రాజకీయ అనుభవానికి సర్పంచ్ పదవి కీలకమని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. కొండపాకలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజకీయాలు శాశ్వతం కాదని, ఆత్మీయతలే శాశ్వతంగా గుర్తిండిపోతాయన్నారు. నియోజక వర్గంలో 175 గ్రామ పంచాయితీలకుగాను 165 బీఆర్‌ఎస్ పార్టీ మద్దతువే ఉన్నాయన్నారు. మెదక్ ఎంపీ టికెట్ గజ్వేల్ నియోజక వర్గ నాయకుడు వంటేరు ప్రతాప్‌రెడ్డికి వచ్చే అవకాశం ఉందని, ఆయన గెలుపు కోసం సమష్టిగా కృషి చేద్దామంటూ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, నాయకులు ర్యాగల్ల దుర్గయ్య, దొమ్మాట మహిపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి దంపతులు

సర్పంచ్‌లకు ఘన సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండటంతో మంగళవారం చిన్నకోడూరు రైతు వేదికలో సర్పంచ్‌ల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ సర్పంచ్‌లను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో సర్పంచ్‌లది కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ కనకరాజు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



స్వయం పాలనలో పాల్గొన్న అక్బర్‌పేట-భూంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా చందన, ఎంఈఓగా జాహ్నవి, ప్రధానోపాధ్యాయుడిగా కృపాసాగర్, టీచర్లుగా అక్షర, రజిత, సన్నీ, ప్రశాంత్, కరుణ్, రాకేష్, హారిక, సంజన, ప్రణీత్ విధులు నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం భిక్షపతి, టీచర్లు కరుణాకర్, శ్రీనివాస్, శ్రీవిద్య, రాజేశ్వరి, వీవీలు సరిత, నవిత, పీఈటీ స్వామి, రూం టూ రీడ్ ప్రతినిధి మధుకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈఓగా శ్రీ వర్ష, ఎంఈఓగా సాయిప్రియ, హెచ్‌ఎంగా రేశ్వంత్, పీఈటీగా హారిక, పలువురు విద్యార్థులు టీచర్లుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం రాజేందర్, టీచర్లు రాజకొండ భూపాల్, దయాసాగర్, శ్రీనివాస్, ప్రకాష్, వినయ్, వెంకట్‌రెడి బహుమతులు ప్రదానం చేశారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీఈఓగా ఎం.సంజన, హెచ్‌ఎంగా పి.వర్షిణి వ్యవహరించారు. అనంతరం సర్పంచ్ స్వామిను విద్యార్థులు సన్మానించారు. హెచ్‌ఎం హరీష్, ఉపాధ్యాయుడు అశోక్, సీఆర్పీ దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్ వాసరి లింగారావు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపన కోసం కృషి చేద్దామన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం జగదేవ్‌పూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాము, సభ్యులు నాగరాజు, సత్యం, కిరణ్, వెంకటేష్, మహేందర్ పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: మహాత్మాగాంధీ చూపిన అహింసా మార్గంలో పయనిస్తూ అందరితో సత్ప్రవర్తనతో మెలగాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని కోర్టు వద్దగల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, అత్తెల్లి శ్రీనివాస్, కొండపోచమ్మ టెంపుల్ మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్‌లో గాంధీకి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సిద్దిపేటజోన్: జాతి విముక్తి కోసం శాంతియుతంగా పోరాటం చేసిన జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చౌక్ వద్ద ఉన్న భారీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి ఆలయ చైర్మన్ లక్ష్మారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: దుబ్బాకలో గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడు ఇస్తారిగల్ల మల్లేశం, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీరాం నరేందర్ పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): గాంధీ వర్ధంతిని మంగళవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సంజీవులు, ఆగంరెడ్డి, శ్రీనివాస్, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఇటీవల బదిలీపై వెళ్లిన లెక్చరర్లు సాయినాథ్, శ్రీవాణీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జూనియర్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు కనక చంద్రం మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి క్రమ శిక్షణను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన



కళాకారులు వేసిన పెద్దపట్నం

నేత్రపర్వంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

మర్కూక్(గజ్వేల్): శ్రీరేణుకా ఎల్లమ్మ కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. మంగళవారం మండలంలోని పాతూరు గ్రామంలో ఏటా అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవంలో భాగంగా ఆలయం వద్ద పూజారులు పెద్దపట్నం వేశారు. కళాకారులు ఒగ్గు కథ వినిపించారు. సర్పంచ్ అరుణ నర్సింలు, ఉప సర్పంచ్ నాగరాణి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ బోయిని నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

హుస్నాబాద్: బంజారాల ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించి, ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు గుగులోతు తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 నుంచి బంజారాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం జిల్లాకు రూ.కోటి కేటాయించారని తెలిపారు. ఏటా ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించేవారన్నారు. సమావేశంలో ఎస్టీ సెల్ నాయకులు. తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌కు సన్మానం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ముంబై మారథాన్‌లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అమరేందర్‌రెడ్డిని మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం, చిన్నకోడూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూపాల్ రాజ్, హుస్నాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ దేవా స్వామి, దుబ్బాక కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులకు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నంటా శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గిరి రవి, ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మొగి పురుగును నిర్మూలించాలి

తోర్నాల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉమారాణి

నంగునూరు(సిద్దిపేట): మొగి పురుగు ఆశించినట్లు గుర్తించిన వెంటనే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేస్తే పంట నష్టాన్ని తగ్గించొచ్చని తోర్నాల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఉమారాణి రైతులకు సూచించారు. మంగళవారం పాలమాకుల, బద్దిపడగ, దర్గపల్లి, జేపీ తండ, రాజగోపాల్‌పేట, ముండ్రాయి గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి మొగి పురుగు సోకినట్లు గుర్తించారు. అనంతరం ఉమారాణి మాట్లాడుతూ యాసంగి నారుమడి పిలక దశలో కాండం తొలుచు (రెక్కల పురుగు) ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. పురుగుల ఉధృతి తెలుసుకునేందుకు దీపపు ఎర, సోలార్ దీపపు ఎర, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, 25 నుంచి 30 పురుగులు కనబడితే తప్పనిసరిగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మొగి పురుగు నివారణ కోసం సిఫారస్ చేసిన గుళికలను యూరియాతో కలిపి వాడుకోవాలన్నారు. నారుమడి, పిలకదశ, పురుగు ఆశించినప్పుడు పిచికారీ చేయాల్సిన మందులను సూచించారు. కార్యక్రమంలో ఏఓ గీత, సర్పంచ్‌లు కుమారస్వామి, కొండల్‌రెడ్డి, బాలయ్య, భిక్షపతి నాయక్, ఏఈఓ అశోక్, వరుణ్ వర్మ, రైతులు పాల్గొన్నారు.



పాలమాకులలో వరిమడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

సాగులో సస్యరక్షణ చేపట్టాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గోనెపల్లి, మాచాపూర్, చిన్నకోడూరు గ్రామాల్లో వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

గజ్వేల్: ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామచంద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక టీపీటీఎఫ్ కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, గజ్వేల్ జోన్ కన్వీనర్ నుంచు నరేందర్, కోకన్వీనర్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కవ్వంపెల్లిని విమర్శిస్తే సహించం**

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ విమర్శిస్తే ప్రజలు సహించరని టీపీసీసీ నాయకుడు రాసూరి మల్లికార్జున్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఓటమిని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే సతీమణిపై అనుచిత వాఖ్యలు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వ పాలనలో చేసిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించనున్నట్లు తెలిపారు.

◆ **బెంచీలు బహూకరణ**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ ప్రాథమిక పాఠశాలకు మంగళవారం సికింద్రాబాద్‌కు చెందిన లింగ హరీష్‌గాంధీ తన తండ్రి జ్ఞాపకార్థం బెంచీలను బహూకరించారు. ఈ సందర్భంగా దాత హరీష్‌గాంధీ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలకు బెంచీలు బహూకరించామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం సత్తయ్య, సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ సభ్యులు సుంకి, స్వరాజ్, సుధాకర్‌రావు, మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదు**

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు లింగాల లక్ష్మణ్ హెచ్చరించారు. మంగళవారం బెజ్జంకిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి పనులను శ్రద్ధతో చేశామన్నారు. ఆరోపణలు బాధ్యాతాయుతంగా ఉండాలని, సంస్కార హీనంగా మాట్లాడొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాజయ్య, ఆలయ కమిటీ చైర్మన్ రాములు, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, బొనగిరి శ్రీనివాస్, దీటి బాలనర్సు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ **సమాచారమివ్వాలి**

బెజ్జంకి(సిద్దిపేట): ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనుమానిత వ్యక్తులు కనిపిస్తే ట్రాన్స్‌కో అధికారులకు సమాచారమివ్వాలని విద్యుత్‌శాఖ ఏడీఈ మాణిక్యాలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల శనిగరంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగుల గొట్టి కాపర్ వైరు చోరీ చేశారని, గతంలోనూ ఇటువంటి సంఘటనలు జరిగినందున రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

◆ **రోడ్డు నిబంధనలు పాటించాలి**

జగదేవ్‌పూర్(గజ్వేల్): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రమోహన్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా జగదేవ్‌పూర్ అలిరాజీపేట గ్రామాల మధ్య ప్రమాదస్థలం, మూలమలుపుల వద్ద పిచ్చి మొక్కలను తొలగించి సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా పిరమిడ్ 14వ వార్షికోత్సవం**

తొగుట(దుబ్బాక): శ్రీ వేంకటేశ్వర పిరమిడ్ ధ్యాన కేంద్రం 14వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాగాల కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుతారి లలిత వంటగదిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల్‌రాజు, ధ్యాన కేంద్రం మాస్టర్ సద్గుణాచారి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా న్యాలపోగుల రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా పయ్యావుల సంజీవ్, ప్రధాన కార్యదర్శిగా న్యాలపోగుల కరుణాకర్, కోశాధికారిగా న్యాలపోగుల హరీష్ ఎన్నికయ్యారు.

◆ **ఆలయ నిర్మాణానికి దాతల విరాళం**

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలోని మర్రిచెట్టు వద్ద నిర్మిస్తున్న దుర్గమ్మతల్లి ఆలయ నిర్మాణానికి మంగళవారం చిట్యాల కొమురయ్య రూ.10,116, చింతల సంజీవరెడ్డి కుమార్తెలు శృతి, కీర్తి, దీప్తి వారి తాత, నాయనమ్మలు క్రీ.శే చింతల నరసింహారెడ్డి, లచ్చవ్వ జ్ఞాపకార్థం రూ.15,116 విరాళం ఇచ్చారు. అదేవిధంగా మిట్టపెల్లి రమేష్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ముందుకు వచ్చారు. దాతలను సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి సన్మానించారు.

◆ **'చేసిన సేవలే గుర్తింపునిస్తాయి'**

తొగుట(దుబ్బాక): ప్రజా ప్రతినిధులుగా ప్రజలకు చేసిన సేవలే గుర్తింపు ఇస్తాయని ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాన్గల్ గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రేమల చంద్రారెడ్డి, వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమల కొమురయ్య, ఎంపీడీవో శ్రీధర్, ఉప సర్పంచ్ మల్లయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

◆ **పౌరహక్కుల దినోత్సవం**

వర్గల్(గజ్వేల్): మండలంలోని సామలపల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి నాగరాజుగౌడ్ మాట్లాడుతూ అంటరానితనం నేరమని, కులవివక్ష పాటిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. పౌరహక్కులకు భంగం కలిగించొద్దన్నారు. పౌరహక్కులు, కుల వివక్ష, సామాజిక, ఆర్థిక అంశాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్యదర్శి, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధ్యతల స్వీకరణ**

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ రూరల్ సర్కిల్ సీఐగా మహేందర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాన్సువాడ రూరల్ సర్కిల్ నుంచి వచ్చారు. ఇక్కడ పనిచేసిన జానకీరాంరెడ్డి సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిక**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) ఉపసర్పంచ్ దొంతరవేని శ్రీనివాస్ మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సమక్షంలో టీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొమ్మగాని హరిబాబు తదితరులు ఉన్నారు.

◆ **మెదక్ జిల్లాకు గద్దర్ పేరు పెట్టాలి**

గజ్వేల్‌రూరల్: మెదక్ జిల్లాకు ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరు పెట్టాలని మాలమహానాడు జాతీయ నాయకుడు తుమ్మ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లాలోని తూప్రాన్‌లో గద్దర్ జన్మించారని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మిగతా రాష్ట్రాల్లో ఆయన తన ఆటపాటలతో చెరగని ముద్ర వేశారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, కార్మికులు, కర్షకులను చైతన్యవంతులను చేశారని, అలాంటి మహనీయుడి గౌరవార్థంగా తాను జన్మించిన మెదక్ జిల్లాకు ప్రజాయుద్ధనౌక గద్దర్ పేరు పెట్టి, హైదరాబాద్‌లో స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలన్నారు.

◆ **17 మంది ఎంపిక**

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీ నిర్వహించిన ఇంటర్వ్యూలో 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జాబ్‌మేళాలు గ్రామీణ పేద విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు ఉద్యోగంతో పాటు ఉన్నత విద్య చదివే అవకాశం కంపెనీ కల్పించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు బ్రహ్మానందరెడ్డి, సోనీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **దరఖాస్తు చేసుకోండి**

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పరిధిలో త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా, పట్టభద్రులు తమ ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 జనవరి 1 నాటికి డిగ్రీ పూర్తి చేసినవారు ఓటుహక్కు కోసం ఫిబ్రవరి 6లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **దుబ్బాక మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా విద్యాధర్**

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా గజ్వేల్ కమిషనర్ విద్యాధర్‌ను నియమించారు. దుబ్బాక కమిషనర్ అనారోగ్యంతో సెలవుపై వెళ్లగా ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టారు.

◆ **పట్టభద్రుల వద్దకే వెళ్లి వెరిఫికేషన్ చేయాలి**

చేర్యాల(సిద్దిపేట): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల వద్దకే వెళ్లి వెరిఫికేషన్ చేయాలని కోరుతూ మంగళవారం సీపీఐ నాయకుడు కత్తుల భాస్కర్‌రెడ్డి తహసీల్దార్ రాజేశ్వర్‌రావుకి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు కోసం నమోదు చేసుకున్న పట్టభద్రులను వెరిఫికేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఫోన్ చేస్తున్నారని, ఫోన్ చేసి పిలిచే బదులు నేరుగా వారి వద్దకే వెళ్లి వెరిఫికేషన్ చేయాలని కోరినట్లు తెలిపారు.